క్లుప్తంగా

నేటి నుంచి తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో మండలాభిషేకాలు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీ తిరుమల బాలాజీ దివ్య క్షేత్రంలో రెండు రోజుల పాటు మండలాభిషేక మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు క్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం సాయంత్రం, సోమవారం ఉదయం విశేష పూజలు, ప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ: గాంధీనగర్ 11కేవీ, ఏపీహెచ్‌బీ 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 10న విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వెంపళ్లనగర్, పెదనడుపూరు, చినదుపూరు, ఏపీహెచ్‌బీ కాలనీ, బర్మా కాలనీ, బాలచెరువు, శీకువానిపాలెం, సీతానగరం తదితర ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

క్యాన్సర్ రోగికి ఆర్థిక సాయం

పెదగంట్యాడ: జీవీఎంసీ 66వ వార్డు ఇందిరా కాలనీలో నివాసం ఉంటున్న మహారాజు సుజాత అనే క్యాన్సర్ బాధితురాలికి ఆ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు రూ.20వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చేతుల మీదుగా ఆమెకు శనివారం నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ ఆమె వైద్యానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తామన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ ఆధ్వర్యంలో అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ శిబిరంలో సాధారణ వైద్య పరీక్షలతో పాటు దంత, చర్మ, కంటి పరీక్షలు చేస్తారని, రక్తపరీక్షలు నిర్వహిస్తారని తెలియజేశారు. ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్న శిబిరాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ వార్షికోత్సవం

ఉక్కునగరం: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 29వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ ఉత్తరాంధ్ర జిల్లాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగి సురేష్ మాట్లాడారు. మందకృష్ణ మాదిగ స్థాపించిన ఎమ్మార్పీఎస్ నేడు దేశంలోని అన్ని రాష్ట్రాలకు వ్యాపించి బడుగు, బలహీన వర్గాల్లో చైతన్యం తెచ్చిందన్నారు. గుండె జబ్బు పిల్లల కొరకు ఉద్యమిస్తే ప్రభుత్వం పిల్లలకు ఉచిత గుండె ఆపరేషన్లు చేయించిందన్నారు. కార్యక్రమంలో డి.సంపూర్ణం, అత్తోటి రవికుమార్, యు.దానమయ్య తదితరులు పాల్గొన్నారు.

మదిని దోచిన చిత్ర గీతాలు

డాబాగార్డెన్స్: నగరానికి చెందిన శ్రీదేవి మహానటి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో «ప్రేమ బృందావనం» పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించారు. రాము, రమణి పాడిన ముందరున్నా చిన్నదాన్ని.. సింగర్ రాజు, కవిత పాడిన నిలగిరి చల్లన.. ఏపీ నాగేశ్వరరావు, సాత్విక పాడిన పూజలకు వేళాయెరా..., హేమంత్, సుజాత పాడిన కొత్తగా రెక్కలొచ్చినా..., అభినయ, కందర్ప రాధ పాడిన కొంతకాలం కొంత కాలం..., నెహ్రూ పాడిన వివాహ భోజనంబు వంటి ప్రజాదరణ పొందిన చిత్ర గీతాలు ప్రేక్షకులను అలరించారు. ముందుగా కళారంగ ప్రముఖుడు కొణతాల రాజు, ఫణిస్వామి కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఘంటసాల క్రీడా సాంస్కృతిక సంఘం వ్యవస్థాపకుడు చెన్నా తిరుమలరావు, సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు సన్‌మూర్తి, ప్రముఖ వ్యాఖ్యాతలు పి. రాజేంద్రప్రసాద్, పి. అభిషేక్, విజయరమణి, సంస్థ గౌరవ అధ్యక్షుడు జేఎంఆర్ నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాతకు సేవా నివాళి

- ఘనంగా వైఎస్సార్ జయంతి
- వాడవాడలా విస్తృతంగా సేవా కార్యక్రమాలు


87వ వార్డులో మహిళకు చీర అందజేస్తున్న కోమటి శ్రీనివాసరావు


తుంగ్లాంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బోగాది సన్యాసిరావు


టీఎన్‌ఆర్ ఫంక్షన్ హాల్లో వైఎస్సార్ చిత్ర పటం వద్ద కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి


67వ వార్డు పాతగాజువాకలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న దేవన్‌రెడ్డి


పెదగంట్యాడలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి


73వ వార్డులో మహిళలకు చీరలు అందజేస్తున్న కార్పొరేటర్ భూపతిరాజు సుజాత


వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్వర్యంలో చిన్నారులకు పుస్తకాలను అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి


65వ వార్డు బీసీ రోడ్‌లో పారిశుధ్య కార్మికులకు భద్రతా పరికరాలు అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి


స్టీల్‌ప్లాంట్ వైఎస్సార్‌టీయూసీ కార్యాలయం వద్ద..


71వ వార్డు శ్రీనగర్‌లో వృద్ధురాలికి చీర అందజేస్తున్న కార్పొరేటర్ రాజాన రామారావు

గాజువాక: దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 74వ జయంతిని నియోజకవర్గంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, అభిమానులు వైఎస్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించారు. వైఎస్ భౌతికంగా లేకపోయినా కోట్లాదిమంది ప్రజల హృదయాల్లో జీవించే ఉన్నారని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.

- 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చేతుల మీదుగా జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందికి రేడియం జాకెట్లు, గ్లౌజులు, మాస్కులు తదితర సేఫ్టీ పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు లోకనాథం, మద్దాల అప్పారావు, పెద్దింటి మంగునాయుడు, నాగిశెట్టి శ్రీనివాస్, ఇరోతి గణేష్ తదితరులు పాల్గొన్నారు.
- 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత ఆధ్వర్యంలో పేదలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు పాల అప్పలరెడ్డి, కంది పైడినాయుడు, శంకర్‌నాయుడు, జగదీష్, అలీ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.
- 66వ వార్డు కొత్త గాజువాక మార్కెట్ జంక్షన్‌లో వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎండీ గౌస్ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి చేతులమీదుగా మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పెదిరెడ్ల ఈశ్వరరావు, పేరం రామకృష్ణారెడ్డి, ఉరుకూటి అప్పారావు, రాజా, కర్రి జగన్ మోహన్, షాహిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.
- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్టుపూడి పరదేశి ఆధ్వర్యంలో వైఎస్ జయంతిని స్థానిక స్ఫూర్తి అనాథాశ్రమంలో నిర్వహించారు. ఆశ్రమంలోని చిన్నారులకు నిత్యావసర సరకులు, పుస్తకాలు, పెన్నులు, రాతసామగ్రి, పండ్లను ఎమ్మెల్యే నాగిరెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు నక్క వెంకట రమణ, ములకలపల్లి వెంకటేష్, పిట్టా రెడ్డి, తోకాడ అప్పారావు, పాము రామశాస్త్రి, ఇసుకపట్ల మీరాభాయి తదితరులు పాల్గొన్నారు.
- 67వ వార్డులో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి ఆధ్వర్యంలో పాతగాజువాక జంక్షన్‌లో వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి చేతుల మీదుగా పేదలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజాన వెంకటరావు, గౌస్, రెడ్డి జగన్నాథం, సూర్యనారాయణ, అచ్చింనాయుడు, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.
- 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు ఆధ్వర్యంలో డ్రైవర్స్ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో పండ్లు పంపిణీ చేశారు. పాలఘాట్ కృష్ణ, అచ్చిబాబు, కొణతాల రాము, బాబులునాయుడు, చట్టి అప్పలరాజు, పల్లా రమణ తదితరులు పాల్గొన్నారు.
- 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు ఆధ్వర్యంలో శ్రీనగర్ జంక్షన్‌లో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.
- 72వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వాసు ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామిరెడ్డి, రామారావు, సత్యనారాయణ, ఉరుకూటి అప్పారావు, వాసవి నాయుడు పాల్గొన్నారు.

87వ వార్డులో చీరల పంపిణీ

కూర్మన్నపాలెం: 87వ వార్డు కూర్మన్నపాలెం మోర్ కూడలి వద్ద వైఎస్సార్ జయంతి నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. పార్టీ కార్యాలయంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, ప్రగడ వేణుబాబు, మాటూరి శ్రీనివాసరావు, బలిరెడ్డి నాగేశ్వరరావు, బొడ్డ గోవింద్, కోమటి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

- 88వ వార్డు యాదవజగ్గరాజుపేటలో వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. జేసీఎస్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, నమ్మి ప్రసాద్, మాడిస రాజు, నమ్మి శ్రీను, యెదురు దుర్గారావు, మాడిస చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహావిష్కరణ

అక్కిరెడ్డిపాలెం: విద్య వైద్య ప్రదాత డాక్టర్ వైఎస్సార్ అని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. తెలుగు వారి గుండెల్లో ఆయన సజీవంగా ఉన్నారన్నారు. 68వ వార్డు మింది జెడ్పీ హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన 12 అడుగుల విగ్రహాన్ని ఎమ్మెల్యే నాగిరెడ్డితో కలిసి మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్ సీపీ సీఈసీ మెంబర్ గుడివాడ అప్పలరామ్మూర్తి, వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, నాయకులు ఈటి శ్యామలరావు, ఈటి శ్రీరాములు, వెంకట్రావు, శంకర్రావు, పోలవరపు శ్రీహరి, చింతపల్లి ఈశ్వరరావు, వరదాడ వెంకటరమణ, సండ్రాన నూకరాజు పాల్గొన్నారు.

- 69వ వార్డు తుంగ్లాంలో వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు నివాళులర్పించారు. కార్యక్రమంలో కాకి అప్పల రెడ్డి, అంగ బాబూరావు, విరోతి రాము, సాలాపు వెంకట్రావు, వాకాడ అప్పలరాజు రెడ్డి, వాకాడ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. రెడ్డి తుంగ్లాంలో నిర్వహించిన కార్యక్రమంలో కొల్లి వినోద్‌రెడ్డి, పెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొని వైఎస్సార్‌కు నివాళులర్పించారు.
- జిల్లా వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కేక్ కట్ చేశారు. మైనార్టీ సెల్ అధ్యక్షుడు అద్దేపల్లి రవిబాబు, ప్రధాన కార్యదర్శి డేవిడ్ రాజు, జాన్సన్, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

అగనంపూడి: 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్ ఆధ్వర్యంలో అగనంపూడి ఆస్పత్రిలో రోగులకు దేవన్‌రెడ్డి చేతుల మీదుగా పండ్లు పంపిణీ చేశారు. నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, నాయకులు సమర,మామిడి శ్రీను, దానబాల అప్పలనాయుడు, బల్ల పైడిరాజు, యలమంచిలి అప్పారావు పాల్గొన్నారు.

ఉక్కునగరం: స్టీల్ వైఎస్సార్‌సీపీ, వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి నిర్వహించారు. సెక్టార్–1 యూనియన్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి వై. మస్తానప్ప, ఆర్. అప్పారావు, దరిగి రవి, డి. పుల్లారావు, బాలమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అనేక పథకాలను అమలు చేసిన ఘనత వైఎస్‌కే దక్కుతుందని కొనియాడారు. ఇప్పుడు తండ్రి బాటలోనే తనయుడు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నడుస్తున్నారన్నారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, మార్టుపూడి పరదేశి, కార్పొరేటర్లు భూపతిరాజు సుజాత, బొడ్డు నరసింహపాత్రుడు, రాజాన రామారావు, నాయకులు గొందేశి మహేశ్వరరెడ్డి, గొందేశి వెంకటరమణారెడ్డి, కులుకూరి మంగరాజు, మంత్రి శంకరనారాయణ, గొందేశి సత్యారావు, ధర్మాల శ్రీను, మద్దాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

- 74వ వార్డులో కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ఆధ్వర్యంలో ఫైర్‌స్టేషన్ ఎదురుగా ఉన్న వైఎస్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- 64వ వార్డు ఇన్‌చార్జి ధర్మాల శ్రీను ఆధ్వర్యంలో యాతపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి మహిళలకు చీరలు పంపిణీ చేశారు
- వైఎస్సార్ సీపీ 75వ వార్డు ఇన్‌చార్జి గొందేశి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పెదగంట్యాడ జంక్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి, దేవన్‌రెడ్డి చేతులమీదుగా పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.
- 77వ వార్డు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

తండ్రిని మించిన తనయుడు జగన్

- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి
- రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఆధ్వర్యంలో 400 మందికి చీరల పంపిణీ

అగనంపూడి: ప్రజలకు మేలు చేయడంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రెండడుగులు ముందుకు వేస్తే, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పదడుగులు వేస్తున్నారని వైఎస్సార్సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. అగనంపూడి కూడలిలో వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గున్నంటి పూర్ణానందశర్మ ఆధ్వర్యంలో నాలుగు వందల మందికి చీరలు, బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ అమలు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, 108 సర్వీస్, రైతులకు ఉచిత విద్యుత్ పథకాలు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నాయన్నారు. ముఖ్యమంత్రి జగన్ అదే పంథాలో పయనించి వాటిని కొనసాగించడంతో పాటు నవరత్నాలు దిగ్విజయంగా అమలు చేస్తూ జనరంజక పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎమెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్, 79వ వార్డు వైఎస్సార్సీపీ ఇన్‌చార్జ్ అప్పికొండ మహాలక్ష్మినాయుడు, గాజువాక జేసీఎస్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, 87వ వార్డు వైఎస్సార్సీపీ ఇన్‌చార్జ్ కోమటి శ్రీనివాసరావు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, నాయకులు ఏదూరి రాజేష్, గుర్రం శ్రీను, సమర, గెద్దాడ సత్యవతి, బోరసోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.


చీరలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి

చకచకా శ్మశానవాటికల అభివృద్ధి

- రూ.30లక్షలతో గుడివాడ అప్పన్న కాలనీలో పనులు పూర్తి
- రూ.1.3 కోట్లతో అక్కిరెడ్డిపాలెం కైలాసభూమి ఆధునికీకరణ
- రూ. కోటితో మిందిలోని మరుభూమిలో సౌకర్యాలు


గుడివాడ అప్పన్న కాలనీలోని శ్మశానవాటికలో కర్మకాండలు జరిపే షెడ్డు


గుడివాడ అప్పన్నకాలనీలోని శ్మశానవాటికలో ఫుట్ పాత్, ప్లాట్ ఫాంలు

అక్కిరెడ్డిపాలెం: వార్డుల్లో అభివృద్ధి పనులపై దృష్టి సారించిన ప్రభుత్వం శ్మశాన వాటికల్లో సౌకర్యాల కల్పనకు కూడా నిధులు మంజూరు చేయడంతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. జీవీఎంసీ 68వ వార్డు పరిధిలోని గుడివాడ అప్పన్న కాలనీ శ్మశాన వాటికను అభివృద్ధి చేయగా మింది, అక్కిరెడ్డిపాలెంలో పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆత్మీయుల అంతిమ సంస్కారాలకు హాజరైన వారికి ఇబ్బంది తలెత్తకుండా సౌకర్యాలన్నీ కల్పిస్తున్నారు. గుడివాడ అప్పన్న కాలనీలోని కై లాసభూమిని ఇప్పటికే రూ.30 లక్షలతో అభివృద్ధి చేశారు. ప్లాట్‌ఫారాలు, ఫుట్ పాత్, కర్మకాండలు జరిపే షెడ్లను సుందరీకరించారు.


అక్కిరెడ్డిపాలెం శ్మశానవాటికలో జరుగుతున్న షెడ్ల నిర్మాణ పనులు

మింది, అక్కిరెడ్డిపాలెంలో..

గతంలో అక్కిరెడ్డిపాలెం, మింది శ్మశాన వాటికల్లో కర్మకాండలు జరిపించాలంటే వచ్చినవారు ఎంతో ఇబ్బంది పడేవారు. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. అక్కిరెడ్డిపాలెం శ్మశానవాటికలో రూ.1 కోటి 30 లక్షల వ్యయంతో జోరుగా పనులు సాగుతున్నాయి. వర్షాకాలం వస్తే చాలు అక్కిరెడ్డిపాలెం శ్మశానవాటిక చెరువును తలపించేది. కానీ ఇప్పుడు నీరు నిలిచే పరిస్థితి లేదు. మింది శ్మశానవాటికలో కోటి రూపాయలతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్లాట్‌ఫారాలు, కర్మకాండలు జరిపే షెడ్లు, ఫుట్‌పాత్‌ల నిర్మాణం జరుగుతోంది. శ్మశానవాటికల అభివృద్ధిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కర్మకాండలకు అనువుగా ఉండేలా..



వార్డులోని అక్కిరెడ్డిపాలెం, మింది, గుడివాడ అప్పన్నకాలనీల్లో అస్తవ్యస్తంగా ఉన్న శ్మశాన వాటికలను సుందరంగా తీర్చిదిద్దుతున్నాం. కర్మకాండలకు అనువుగా ఉండేటట్లు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. పనుల నాణ్యతపై అధికారులకు ఎప్పటికప్పుడు ఆదేశాలిస్తున్నాం.

– గుడివాడ అనూష, 68వ వార్డు కార్పొరేటర్

అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం



నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నాం. అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. అన్ని వార్డుల్లో శ్మశానవాటికల అభివృద్ధిపై దృష్టి సారించాం. నిధులు కేటాయించి పనులు త్వరితగతిన జరిగేలా చూస్తున్నాం. కొన్ని చోట్ల ఇప్పటికే పూర్తయ్యాయి. కొన్ని చోట్ల పనులు సాగుతున్నాయి.

– తిప్పల నాగిరెడ్డి, ఎమ్మెల్యే

ఉక్కు ఉద్యమం భావి తరాలకు స్ఫూర్తి

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం చేస్తున్న ఉద్యమం భవిష్యత్తు తరానికి స్ఫూర్తిగా నిలుస్తుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 877వ రోజు శనివారం ఆర్ఎంహెచ్‌పీ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ రైతులు సాగించిన పోరాట ఫలితంగా మోదీ ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుందని, స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు అటువంటి పోరాటాలు చేయక తప్పదన్నారు. ఉక్కు నిర్వాసితులు చేసిన ప్రాణత్యాగాలను మోదీ ప్రభుత్వం గుర్తు చేసుకోవాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే ఉత్పత్తిలో పరుగులు పెడుతూ దేశంలో నెంబర్ వన్ పరిశ్రమగా ఎదుగుతుందని, కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.


877వ రోజు దీక్షశిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

సెలెస్ట్‌వాసుల ఆందోళన

గాజువాక: తమ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్లలో కల్పిస్తామని చెప్పిన సౌకర్యాలను అందుబాటులోకి తేవకపోవడంపై స్థానిక సెలెస్ట్ నివాసులు శనివారం ఆందోళన నిర్వహించారు. కాలనీలోని టవర్ల నుంచి మెయిన్ గేటు వరకు ర్యాలీ నిర్వహించారు. కాలనీలో 65 శాతం గ్రీనరీ అభివృద్ధి చెస్తామని చెప్పిన బిల్డర్ ఇప్పుడు దాన్ని పూర్తిగా విస్మరించారని కాలనీ సంఘాల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, దామోదర్ పేర్కొన్నారు. పార్కును అభివృద్ధి చేయలేదని, జీవీఎంసీకి అప్పగించిన ఖాళీ స్థలంలో తాము పార్కును అభివృద్ధి చేస్తామని కోరుతున్నా అధికారులు స్పందించకపోవడం అన్యాయమన్నారు. బిల్డర్ నిర్లక్ష్యం వల్ల కాలనీలో మెయింటెనెన్స్ దెబ్బ తిన్నదని, ఫైర్ పంప్స్ పాడయిపోయాయని, సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ సరిగా పని చేయడంలేదని తెలిపారు. నివాసులకు హామీ ఇచ్చిన అనేక అంశాలు ఇంకా కార్యరూపం దాల్చలేదని పేర్కొన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏ,బీ,సీ టవర్ల సంఘాల ప్రతినిధులు పవర్ జశ్వాల్, సింగంపల్లి దేముడు, వర్మ, పైడిరాజు, సత్యనారాయణ, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.


ఆందోళనలో పాల్గొన్న సెలెస్ట్ వాసులు

‘ఫైవ్ ఎస్’ నిర్వహణతో భద్రత, ఉత్పాదకత మెరుగు

ఉక్కునగరం: పని ప్రదేశంలో ఫైవ్ ఎస్ (సార్ట్, సెట్ ఇన్ ఆర్డర్, షైన్, స్టాండరైజ్, సస్టెయిన్) నిర్వహణతో విభాగాల్లో భద్రత, పరిశుభ్రత, ఉత్పాదకత మెరుగుపడతాయని స్టీల్‌ప్లాంట్ మెకానికల్ జీఎం పి.ఎస్. ఘోష్ అన్నారు. ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ విభాగంలో శనివారం నిర్వహించిన ఫైవ్ ఎస్ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతీ విభాగం తమ ఉద్యోగులను ఫైవ్ ఎస్ దిశగా ప్రోత్సహిస్తే తప్పనిసరిగా అన్ని అంశాల్లో అభివృద్ధి కనిపిస్తుందన్నారు. ఇంజినీరింగ్ షాప్స్ జీఎం ఎం.వి.ఎస్.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులందరూ ఫైవ్ ఎస్‌కు మద్దతుగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కైజన్, బెస్ట్ ఫైవ్ ఎస్ జోన్, స్లోగన్ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ సర్వీసెస్ విభాగం జీఎం ఎం.మధుసూదనరావు, ఫైవ్ ఎస్ కో–ఆర్డినేటర్ విద్యాసాగర్, సిహెచ్. శ్రీనివాస శాస్త్రితో పాటు అన్ని సెక్షన్ల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


విజేతకు బహుమతి అందజేస్తున్న జీఎం దుర్గాప్రసాద్

సనాతన ధర్మాన్ని పాటించండి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న స్వామీజీ

ఉక్కునగరం: సనాతన హిందూ ధర్మాన్ని పాటించాలని చిన్మయ మిషన్ స్వామీజీ రఘువీరానంద సరస్వతి అన్నారు. బీజేపీ సంపర్క్ సే సమర్థన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు శనివారం స్వామిజీని కలిసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. ఆయన అనుగ్రహ భాషణం విన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనపై రూపొందించిన పుస్తకాలు, కరపత్రాలను స్వామిజీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, జి. శంకరరావు, జగ్గారావు, విశాల్ తదితరులు పాల్గొన్నారు.